# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 09-10-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అమరావతి అభివృద్ధితో పాటు రాజధానికి భూములిచ్చిన రైతులు కూడా అభివృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.**
2. **ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈరోజు పర్యటిస్తారు.**
3. **బాణాసంచా తయారీ కేంద్రాలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వి. అనిత తెలిపారు.**
4. **కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో ప్రజలకు నిత్యావసర వస్తువులు మరింత అందుబాటులోకి వచ్చాయని ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.**
5. **తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ ఈరోజు విడుదల కానుంది.**

==========================

అమరావతి అభివృద్ధితో పాటు... రాజధానికి భూములిచ్చిన రైతులు కూడా అభివృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 53వ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ- సీఆర్డీఏ సమావేశం నిన్న జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాజధాని రైతులకు కౌలు చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని, భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపులో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సచివాలయం భవనాలతో సహా ఇతర నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని, పశ్చిమ బైపాస్ రహదారిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈరోజు పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఉప్పాడ ప్రాంత మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకుంటారు. ఇందులో భాగంగా సముద్ర జలాలు కలుషితమవుతున్నాయని మత్స్యకారులు ఆందోళన చేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించేందుకు సముద్రంలో ప్రయాణించనున్నారు. అనంతరం ఉప్పాడలో మత్స్యకారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అలాగే పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని అధికారులు తెలిపారు.

--------------------------

తెలంగాణలో మండల ప్రజా పరిషత్ – ఎంపీటీసీ, జిల్లా ప్రజా పరిషత్ – జడ్పీటీసీ స్థానాలకు ఈరోజు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ ఉదయం 10 గంటల 30 నిమిషాలకు అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. తెలంగాణ ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు.. మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడత ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్లను ఈరోజు నుంచి ఈనెల 11 వరకు స్వీకరించనున్నారు. ఈనెల 12న నామినేషన్లు పరిశీలించనుండగా, ఉపసంహరణకు ఈనెల 17ను గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈనెల 23న పోలింగ్ జరగనుంది. నవంబరు 11న ఫలితాలు ప్రకటిస్తారు.

---------------------------

బాణాసంచా తయారీ కేంద్రాలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వి. అనిత తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వి. సావరం ప్రాంతంలోని తయారీ కేంద్రంలో నిన్న జరిగిన అగ్నిప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ఈ నేపథ్యంలో సంఘటనా స్థలాన్ని మంత్రి గత సాయంత్రం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తెలియజేస్తూ,.

వాయిస్ 34 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఈ నెల 16వ తేదీన శ్రీశైలంలో జ్యోతిర్లింగం, భ్రమరాంబ శక్తిపీఠాన్ని ప్రధాని దర్శించుకుంటారని చెప్పారు. అనంతరం కర్నూలు జిల్లా ఓర్వకల్లులో జరిగే "జీఎస్టీ సంస్కరణల ఉత్సవ్" సభలో పాల్గొననున్నారని తెలిపారు. ప్రధానమంత్రి సభకు వచ్చే వారి కోసం ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని... ఆహారం, తాగునీరు వంటి సౌకర్యం కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను– జీఎస్టీ తగ్గించడంతో ప్రజలకు నిత్యావసర వస్తువులు మరింత అందుబాటులోకి వచ్చాయని ఆంధ్రప్రదేశ్ ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణంలో పలు నిత్యావసర సరుకుల దుకాణాలను గత సాయంత్రం సందర్శించి జీఎస్టీ తగ్గింపుపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ,

వాయిస్ 27 సెకన్లు

---------------------------

ప్రజల దైనందిన జీవితంలో తపాలా సేవల ఆవశ్యకతను తెలియజేస్తూ ఈరోజు ప్రపంచ తపాలా దినోత్సవం

నిర్వహిస్తున్నారు. స్విట్జర్లాండ్ దేశంలో బెర్న్ పట్టణంలో 1874 అక్టోబర్ 9వ తేదీన యూనివర్సల్ పోస్టల్ యూనియన్ స్థాపనకు గుర్తుగా ప్రతి ఏటా అక్టోబర్ 9వ తేదీన ప్రపంచ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తపాలా సేవల ఆవశ్యకతను తెలియజేస్తూ... దేశవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర తపాలా శాఖ పలు కార్యక్రమాలు చేపడుతోంది.

------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పర్యావరణ పరిరక్షణకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య తెలిపారు. వలయ ఆర్థిక వ్యవస్థపై వివిధ పరిశ్రమల ప్రతినిధులతో నెల్లూరులో జరిగిన సదస్సులో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ వ్యర్థాల పునర్వినియోగంతో పాటు, చెత్త నుండి సంపద సృష్టి వంటి ప్రక్రియలను మరింత ముమ్మరంగా చేపట్టాలన్నారు. వ్యర్థాలను విలువైన సంపదగా మార్చేందుకు జిల్లాలో రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని కోరారు.

------------------------

దేశ ఆర్థిక వ్యవస్థలో సహకార రంగం కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర ప్రభుత్వ సహకార మంత్రిత్వశాఖ కార్యదర్శి అశీష్ కుమార్ భూటాని అన్నారు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖతో కలిసి "సహకార రంగం అభివృద్ధి –డిజిటలైజేషన్, కోఆపరేటివ్ బ్యాంకింగ్ బలపరిచే దిశగా" అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి కార్యశాలను ఆయన నిన్న తిరుపతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా అశీష్ కుమార్ మాట్లాడుతూ, సహకార బ్యాంకింగ్ రంగంలో రాష్ట్రాల నుండి విస్తృతమైన ఆలోచనలు రావలసిన అవసరం ఉందన్నారు. రాష్ట్రాలలో సహకార విద్యా వ్యవస్థను ఎలా అనుసంధానించాలి, పాఠశాలలు ఎలా స్థాపించాలనే విషయాలపై ఈ సదస్సులో చర్చిస్తామని తెలిపారు.

------------------------

తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల మీదుగా ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో... ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రెండు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావు పేర్కొంటూ..

..వాయిస్.. 30 సెకన్లు

మరోవైపు తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు, రేపు ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

------------------------

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలో పలు ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తిచేశామన్నారు. రాష్ట్ర విద్యా వ్యవస్థను ఆదర్శ విద్యా వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీలను కూడా పారదర్శకంగా నిర్వహించామని విద్యావ్యవస్థలో మార్పులకు ఉపాధ్యాయుల సహకారం అందించాలని కోరారు.

====================